# మ్యూజిక్ మిస్సు

శోభాదేవి తాను సంగీత సామ్రాజ్ఞి కావాలని ఎన్నో కలలు కన్నది! అందుకు తగిన కృషీ చేసింది!

సంగీతమంటే ఎంత ప్రాణమో... ముచ్చట్లు చెప్పాలన్నా... పోచికోలు కబుర్లాడాలన్నా అంతకంటే ఎక్కువే ఇంటరెస్ట్ శోభాదేవికి!

దమ్మిడీకి పనికిరాని చొల్లు కబుర్లు చెప్పటంలో ఆమెకు ఆమే సాటి! ఎంతటి వారినైనా మాటలతో బుట్టలో పడేయటం ఆమెకు గల టాలెంట్.

శోభాదేవి చెప్పే ముచ్చట్లకు అంతుండదు. ధారావాహికంగ చెప్పిన విషయాలు చెప్పకుండా చెప్తూనే వుంటుంది. రోజులు... నెలలు... సంవత్సరాల తరబడి!

పేరంటానికెళ్ళినా... దైవదర్శనానికి గుడికెళ్ళినా ఇదే తంతు! మనిషి దొరికితే చాలు! మటాషే!

మ్యూజిక్‌లో 'డిప్లమా' హోల్డర్! డిగ్రీ అయిన తర్వాత మ్యూజిక్ కాలేజీలో చేరి ఫైనలియర్లో గోల్డ్‌మెడల్ సాధించింది!

మనిషి అందంగ... నాజూగ్గా... ఆకర్షణీయంగ వుండటంతో ఏ వక్కమగాడు ఆమె కళ్ళకు నచ్చి చావకపోవటంతో మిస్సుగానే మిగిలింది. పెళ్ళి ఆలోచనను బుర్రలో ఓ మూలకు నెట్టేసింది.

పోనీ తనైనా ప్రేమించి లవ్‌లో ఎవర్నైనా పడేద్దామని... తనకు నచ్చిన మగాడు తారసపడితే.. అరనవ్వో చిరునవ్వో నవ్వేది! పరులు గ్రహించకుండా కన్నుగీటేది... పైట జార్చేది. ఆడదానికి పోకిరీ వేషాలేమిటి చెప్మా అనుకుని బెదిరిపోయారేగాని.. ఏ ఒక్కడూ ముందుకొచ్చి పెళ్ళికి 'సై' అన్న పాపానపోలేదు.

అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేత పట్టుకుని శోభాదేవి గరల్స్ హైస్కూలు చేరుకుని హెడ్‌మిస్ట్రెస్ ముందు నిలబడింది.

హెచ్.ఎం. తలెత్తిచూసి 'మీరు మ్యూజిక్ టీచర్ కదా?... ఓకలా?... ఇన్స్ట్రుమెంటలా?...' ప్రశ్నించింది.

'గాత్రమేనండీ! డిగ్రీ చదివిన నేను మ్యూజిక్‌లో అయిదేళ్ళ డిప్లమా చేసిన గోల్డ్‌మెడల్ విన్నర్ని! ఎన్నోచోట్ల సంగీత కచేరీలు చేసాను. ఆలిండియా రేడియో 'ఏ' గ్రేడ్ ఆర్టిస్ట్‌ని!

చెప్తే నమ్మరుగానీ... నేనెక్కడ కచేరీ చేసినా... బాలమురళీకృష్ణగారు, ఎం.ఎస్.సుబ్బలక్ష్మిగారు వచ్చి నన్ను అభినందించి ఆశీర్వదించేవారు. సన్మానాలు... పురస్కారాలకేం కొదవలేదు...' బంగారు నగలకు బదులు తన మెడలో వున్న ఒలంపిక్స్‌లో గెల్చుకున్నంత సైజులో వున్న పాతిక గోల్డ్ మెడల్స్ చూపించింది శోభాదేవి.

శోభాదేవి మాటలు వింటూ బందీ అయిన హెచ్.ఎం. ఎగాదిగ చూసింది ఆమె ముఖంలోకి.

బొడ్డు కిందకు చీరె... నెత్తిన కొప్పు... పెదాలకు లిప్‌స్టిక్... నల్ల కళ్ళద్దాలు... హై హీల్ షూస్... చూపులకు శోభాదేవి సినిమా తారలను సైతం తలపించే దేవకన్యలా అవుపించింది. కానీ... మిస్సో... మిసెస్సో మాత్రం అర్థంకాలేదు.

ఈమెకొచ్చే నెలజీతం మేకప్‌కి అలంకారాలకు మాత్రం ఏం చాలుతుందబ్బా అన్పించింది.

'అంతేకాదండీ!... నా గాత్ర మాధుర్యానికి మెచ్చి భారత రాష్ట్రపతి... ప్రధానమంత్రి... మన రాష్ట్రముఖ్యమంత్రి వర్యులనుండి బంగారు పతకాలు... ఐమీన్... గోల్డ్ మెడల్స్ అందుకున్నాను!... ఇవిగో... ఈ మూడూ వారిచ్చినవే!...' మెళ్ళోనున్న మూడు మెడల్స్‌ను చేత్తో పైకెత్తి హెచ్.ఎం.కి ప్రత్యేకంగ చూపింది.

అబ్బో! ఈమె మాటకారే! సెల్ఫ్ డబ్బా వాయించుకోవటంలో ఈమె దిట్ట కాబోలు... ఇలాంటి ఈమె పిల్లలకు సంగీతమేం నేర్పుతుంది? అనుకుంది హెచ్.ఎం. మనసులో.

'మీ మెళ్ళో అన్నీ మెడల్సే కన్పిస్తున్నాయ్... నగలేం చేయించుకోలేదా?-' ఫక్త్ ఆడ ప్రశ్నవేసింది హెచ్.ఎం.

'వీటినే మొయ్యలేక ఛస్తున్నాను... ఇంకా నగలు కూడా దేనికో? అనుకున్నాను మేడమ్...'

'అవునూ... నువ్వు మేరీడా?-'

'నోనోనో! నేను స్టిల్ మిస్సునే...' కళ్ళు తిప్పుతూ ఒయ్యారాలొలకబోస్తూ మనిషి మెలికలు తిరుగుతూ గారంపోయే పదేళ్ళ పిల్లలా బదులిచ్చింది.

'అవునూ... ఇంతటి ప్రతిభాపాటవాలున్న దానివి... టీచరుద్యోగాన్నెందుకు ఎంచుకున్నట్లు?...' ఛైర్లో వెనక్కు వాలి క్వశ్చన్ చేసింది.

'మీ డౌటు క్లియర్ చేస్తాను మేడమ్! జాబ్ అయితే సర్వీసులో వున్నంతకాలం

నెలనెలా శాలరీ గ్యారంటీ! అదే సంగీత కచేరీలమీదే ఆధారపడితే... నెలకు నాలుగైదు ప్రోగ్రామ్స్ మించి వుండవ్. పైగా... వుద్యోగం చేస్తే... రిటైర్ అయింతర్వాత చచ్చినట్టు ఫస్ట్‌కల్లా పెన్షనొస్తుంది కదా?!- చచ్చేవరకూ ఢోకా వుండదు...'

ఓసి నీ ఇల్లు బంగారంకానూ? నీకెంత తెలివిపెట్టాడే ఆ దేవుడు?! నీ సెల్ఫ్ డబ్బా కాసేపు ఆపవే తల్లీ... హెచ్.ఎం. మనసు బాధతో మూలిగింది పైకి అన్లేక.

'అహఁ! అయితే ఇంకేం?... ఈరోజే జాయినింగ్ రిపోర్టిచ్చెయ్. డ్యూటీలో చేరిపో! చూడు మిస్ శోభాదేవి... వారానికి రెండు పీరియడ్స్ వుంటయ్ మ్యూజిక్ క్లాసెస్. సిలబస్ ననుసరించి కిందనుంచి... టెన్త్ స్టూడెంట్స్ దాకా పాఠాలు చెప్పు! ఏం? యుకెన్ గో!...' చిరాకు పడిపోతూ మ్యూజిక్ మిస్‌ను పంపేసి కాస్సేపు సీట్లో జారగిలపడి రిలాక్స్ అయింది హెచ్.ఎం.

వెళ్ళిపోయిందనుకున్న శోభాదేవి రీ ఎంట్రీ ఇచ్చి 'హెచ్.ఎం. గారూ! మీకో విషయం చెప్పటం మరిచాను... మరేంలేదు... నేను గళమెత్తి ఆలపిస్తే... కోకిలలు సైతం తోకలు ముడవాల్సిందే! అనటంతో ఏదో గుర్తొచ్చి కుర్చీలోంచి తన భారీకాయంతో వృద్ధ ఏనుగులా అడుగులేస్తూ 'మిస్ శోభాదేవీ...' రండి నాతో... టీచర్స్ అందరికీ మిమ్మల్ని పరిచయం చేస్తాను...'

ఇద్దరూ స్టాఫ్‌రూమ్ వేపు దారితీశారు.

హెచ్.ఎం. రాకను గమనించిన టీచర్లందరూ తమ చిట్‌ఛాటింగ్ ఆపి లేచి నిలబడ్డారు.

'అఁ! చూడండి టీచర్లూ!... ఈమె పేరు శోభాదేవి! మన గరల్స్ హైస్కూల్‌కి కొత్తగా ఈరోజే రిపోర్ట్ చేస్తున్న మ్యూజిక్ టీచర్...' పరిచయ వాక్యాలు పలికింది హెచ్.ఎం.

అక్కడున్న మహిళలంతా పేరు పేరునా ఇంట్రడ్యూస్ చేసుకున్నారు.

హెచ్.ఎం. ఈడ్చుకుంటూ నిష్క్రమించింది.

టీచర్లంతా వింతగ శోభాదేవిని ఆపాదమస్తకం వీక్షించి ఆమె సొయగానికి... అందచందాలకు మురిసారు. ముసిముసిగా నవ్వుకున్నారు.

'మీ మెడలో గల మెడల్సేమిటండీ?' సైన్స్ టీచర్ అడిగింది.

'సంగీత పోటీల్లో పలుచోట్ల గెల్చుకున్న గోల్డ్ మెడల్స్...!' గర్వం ధ్వనించింది శోభాదేవి మాటల్లో.

'ఇవి గోల్డ్ కోటింగ్ అనుకునేరు. ట్వెంటీటు కేరెట్స్ ప్యూర్ గోల్డ్ సుమా...' అనేసి మెడలోంచి రిబ్బన్లకు వేలాడే మెడల్స్‌ను ఒక్కొక్కటిగా చూపుతూ తనకెవరెవరు బహూకరించిందీ వివరంగ చెప్పింది శోభాదేవి.

★★★★★

ఆ బాలికల స్కూల్‌కో చరిత్ర వుంది! బ్రిటీష్‌కాలం నాటిది కావటంతో స్కూలు కప్పు సగం కూలిపోయింది. విరిగిన బెంచీలతో... పైకప్పులేని బిల్డింగ్‌లోనే స్కూల్ నడుస్తున్న దౌర్భాగ్యాన్ని ప్రభుత్వాలు పదవిలోకొచ్చినప్పుడల్లా... వీక్షించి... కొత్త బిల్డింగ్ కట్టిస్తామంటూ చేసిన వాగ్దానాలన్నీ... పాపం బడ్జెట్ లేకపోవటంవల్ల... ఈనాటికీ అదే శిథిలావస్థలో వుంది.

అక్కడున్న చెట్లకిందే పిల్లలకు పాఠాలు! అక్కడ చదివిన ఆడపిల్లలెవరూ పెద్ద పెద్ద ఉద్యోగాల్లో చేరే అవకాశం కలగలేదు. పై చదువులకూ వెళ్ళలేకపోతున్నారు.

విద్యార్థినులను... వారికి చెప్పాల్సిన పాఠాలను గాలికొదిలేసిన టీచర్స్ మాత్రం ఠంచనుగా జీతాలు మాత్రం నెలనెలా పుచ్చుకుంటూనే వుండటం మరో విశేషం!

అలాంటి అద్భుత చరిత్ర గలిగిన గరల్స్ హైస్కూల్లో మ్యూజిక్ టీచర్‌గ జాయినైంది శోభాదేవి.

అసలే పిల్లలకు శ్రద్ధగా పాఠాలు చెప్పటం అంతంత మాత్రంగ వుంటే... శోభాదేవి మ్యూజిక్ మిస్‌గా రిపోర్ట్ చేశాక... సమయాన్ని వృధా చేస్తూ ముచ్చట్లతో కాలక్షేపం చేయటం మరింత శృతిమించింది.

శోభాదేవి సంగీత పాఠాలు పిల్లలకు నేర్పే తీరుకు హెచ్.ఎం.తోపాటు టీచింగ్ స్టాఫ్ అంతా దిగ్భ్రాంతికి లోనుకాక తప్పలేదు.

ఆమె గాత్రశృతికి మిగతా భవనం పైకప్పు కూడా ఎప్పుడు కూలుతుందో అన్పించటంతో అందరూ భయభ్రాంతులకు లోనుకాక తప్పటంలేదు.

ఈ మహాతల్లి మ్యూజిక్ క్లాసులు కాదు గానీ... రోజూ చెవులలో దూది పెట్టుకోవాల్సి వస్తున్నందుకు విసుక్కోని రోజులేదు. పిల్లలు సైతం హడలిపోతున్నారు. మేఘావృతంకాని ఆకాశాన్నుండి పిడుగులు పడుతున్నాయన్పిస్తోంది అంటూ రోజూ గొణుక్కోవటమే!

ఆ పరిస్థితిలో వున్న గరల్స్ హైస్కూల్ ఇన్స్పెక్షన్‌కు తొలిసారిగ విద్యామంత్రిణిగ ప్రమాణ స్వీకారం చేసిన సైదులమ్మ రెండోకంటికి తెలీకుండా మందీ మార్బలం ంటరాకుండా... ప్రభుత్వమిచ్చిన కారును సైతం వినియోగించుకోను ఇష్టపడక...

స్వంత డబ్బుతో ఆటోలో బయలుదేరింది.

సైదులమ్మంటే పులి! దమ్మున్న మహిళ! ఆమె గాండ్రిస్తే అసెంబ్లీ దడదడలాడుతుంది. ఆమెకు ఎదురుచెప్పే వారి నోళ్ళు మాటరాక మూగపోతయ్! సైదులమ్మకున్న మరోపేరు అపరకాళి!

అలాంటి మంత్రిణిగారు స్కూల్ ఇన్స్పెక్షన్ వస్తున్నదని ఎలా పసికట్టిందో శోభాదేవి... ఎవ్వరికీ తెలీకుండా పూలదండలు సీక్రెట్‌గా తెప్పించి ఉంచింది. స్వీట్సు ఆర్డరిచ్చింది. ఒక ఫోటోగ్రాఫర్‌ని ఎరేంజ్‌చేసింది. కాశ్మీర్ శాలువా తెప్పించింది.

ఆటో దిగి గేటువద్ద నిలబడి లోనికి రాబోతున్న సైదులమ్మను ఆడ వాచ్‌మెన్ అడ్డుకుని అభ్యంతరం తెలిపింది... ఆ వచ్చిందీ ఎవరైనదీ తెలీక!

ఇదంతా దూరంనుండి గమనించిన శోభాదేవి పరుగు పరుగున వచ్చి సైదులమ్మ గారిని లోనికి ఆహ్వానించింది.

'నేను మీకెలా తెల్సు' మంత్రిణి క్వశ్చన్ చేశారు శోభాదేవిని చూస్తూ. ఫ్లాష్ బేక్ గుర్తుకురాక!

'మీ అబ్బాయిగారి పెళ్ళికి సంగీత కచేరీ చేసింది నేనే మేడమ్! శోభాదేవిని... నన్ను మర్చిపోయారా?-' వెంట నడుస్తూ అంది.

'అవునూ... నీకిక్కడేం పని?-' మంత్రిణి ప్రశ్న.

'నేను ఇక్కడ మ్యూజిక్ టీచర్‌ని...'

ఇద్దరూ హెచ్.ఎం. రూమ్‌లోకి ఎంటరైనారు.

ఈ పాటల పంతులమ్మ తన రూమ్‌లోకెందుకొచ్చినట్టు... ఈమె పక్కనున్న రుబ్బురోలు ఎవరై వుంటారబ్బా అనుకుంది తన ఛైర్లో కూర్చునే.

'మన ఎడ్యుకేషన్ మినిస్టర్‌గారు హెచ్.ఎం. గారూ...'

శోభాదేవి మాటకు వులిక్కిపడి... భారీ కాయంతో పైకి లేచి నిలబడి... కన్నీరు పెట్టుకుని 'క్షమించండి మేడమ్...' అంది హెచ్.ఎం.

స్టూడెంట్ పిల్ల తెచ్చి ఇచ్చిన రోజాపూల దండ మినిస్టర్ సైదులమ్మ మెడలో వేసి చప్పట్లు చరిచింది శోభాదేవి.

ఫోటోగ్రాఫర్ వివిధ యాంగిల్స్‌లో కెమెరాను క్లిక్ మన్పించాడు.

ఓసి దీని అఘాయిత్యం కూల! మినిస్టరొస్తున్నట్టు తనతో ఒక్కమాటైనా చెప్పి

చూపలేదు. క్రెడిటంతా తానే కొట్టేయాలని చూస్తున్నదేమో... మనసులో ఈసడించుకుంటూ గొణుక్కుంది హెచ్.ఎం.

హాజరు పట్టిక... ఇతరమైన రికార్డ్స్ చూచి స్కూలు ప్రాంగణమంతా కలియతిరిగిన సైదులమ్మ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ... 'హెచ్.ఎం.గారూ! మీకు వయసైపోయింది. చేసిన సర్వీసు చాలు! వి.ఆర్.ఎస్. తీసుకోండి... మీరు అప్లికేషన్ రాసిస్తే నేను యాక్షన్ తీసుకుంటాను...' అన్చెప్పటంతో హెచ్.ఎం. కుప్పకూలింది. హార్ట్ ఎటాక్ వచ్చినంత పనైంది. భోరుమంది.

తనకు శాలువా కప్పుతున్న శోభాదేవిని చూస్తూ 'నువ్వే ఈ హైస్కూలుకి నెక్ట్స్ హెడ్‌మిస్ట్రెస్‌వి! అవును నీకు అవుటాఫ్ టర్న్ ప్రమోషనిప్పించి... నిన్ను హెచ్.ఎం.ని చేస్తా... ఓకే!...' అధికార దర్పంతో తన మనసులో నిర్ణయాన్ని చెప్పింది మంత్రిణి సైదులమ్మ.

'మీరు తల్చుకుంటే ఏమైనా చేయగలరు మేడమ్! మీకున్న పవర్ అలాంటిది. రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవాని... మీరు హెల్ప్ చేయాలనుకుంటే ఆరు నూరైనా... నూరు ఆరైనా చేస్తారు. చేసి చూపిస్తారు...' వినయం పుట్టిపడేలా మాటలతో ములగచెట్టు ఎక్కించింది శోభాదేవి.

వీళ్ళిద్దరి సంభాషణ వింటున్న హెచ్.ఎం. కడుపు చెరువైంది. నిమ్మకు నీరెత్తినట్టు గుడ్లు వప్పగించి చూస్తూ మౌనంగ వుంది.

హెచ్.ఎం. రూమ్‌లోంచి బైటికొచ్చిన సైదులమ్మను ఫాలో అవుతోంది శోభాదేవి.

'మీవెంట బిళ్ళ బంట్రోతును కాకపోయినా గన్‌మెన్‌ని తెచ్చుకుంటే బావుండేది. పైగా కార్లో రాకపోవటం మీ దర్జాకి లోటన్పిస్తోంది...'

'ఎవరకీ తెలీకుండా వచ్చి సర్‌ప్రైజ్ విజిట్ చేయాలనుకున్న నా ప్లాన్ నువ్వు తలకిందులు చేశావ్!- బైదిబై మా గ్రాండ్ డాటర్ బర్త్‌డేకి నువ్వే వచ్చి సంగీత కచేరీ చేయాలి! ఇన్విటేషన్స్‌లో నీ పేరు వేయిస్తాను. డోన్ట్ మిస్...' ఆటో ఎక్కుతూ అంది మంత్రిణి సైదులమ్మ.

సైదులమ్మ ఆటో కనుమరుగయ్యేవరకు చేయి వూపుతూనే వుంది శోభాదేవి.

ఎంతటి వారినైనా మాటలతో బురిడీ కొట్టించగల నేర్పరి కదా శోభాదేవి?

- సమాప్తం -